క్లుప్తంగా

నేడు రుద్రాభిషేకం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న మీనాక్షి సమేత నందీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా వేడుకలు చేపట్టనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నూరాని మసీదు అధ్యక్షుడిగా మహబూబ్ బాషా



పెనుమూరు(కార్వేటినగరం): నూరాని మసీదు నూతన అధ్యక్షుడిగా ఎస్.మహబూబ్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉదయం ముస్లింలు నూరాని మసీదు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా సిరాజ్‌బాషా, కోశాధికారిగా అల్తాఫ్‌హుస్సేన్‌లను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా మున్నాఖాన్, ఎస్.జిక్రియబాషా, ఎస్.మహమ్మద్‌రఫీ, పండుభాయ్, దావుద్‌భాయ్, షంషీర్, ఇమ్రాన్, నౌషాద్, గఫూర్, మాబూలను ఎన్నుకున్నారు. నూరాని మసీదు అధ్యక్షుడిగా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఏఎంసీ కార్యక్రమంలో పాల్గొన్న యోగా శిక్షకులు

నగరి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు పుల్లయ్య అన్నారు. ఆదివారం సరస్వతి విజ్ఞాన మందిరంలో యోగాలో భాగంగా మానసిక దృఢత్వానికి నిర్వహించిన ఏఎంసీ కార్యక్రమంలో ఆయన యోగా ఆవశ్యకతను తెలియజేశారు. శరీరానికి వ్యాయామాలు ఎంత ముఖ్యమో మనసుకు కూడా అంత ముఖ్యమని ధ్యానంతో అది సాధ్యమన్నారు. ధ్యానం చెయ్యడం ద్వారా మనసును కట్టడి చేయవచ్చన్నారు. ధ్యానం చేసే విధానాలపై అందరికీ శిక్షణ అందించారు. యోగా నిర్వాహకుడు ఎల్లప్పరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహాన్ని ఆశ్రమం ప్రతినిధులకు అప్పగిస్తున్న పోలీసులు

గంగాధరనెల్లూరు: జీడీ నెల్లూరు మండల కేంద్రంలో ఓ అనాథ శవానికి పోలీసులు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. గంగా ధరనెల్లూరులో గత కొంత కాలంగా షాపుల వద్ద ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటున్న ఓ అనాథ వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. ఆ వ్యక్తి చనిపోయినా ఎవరూ పట్టించుకోలేదని సమాచారం అందుకున్న జీడీ నెల్లూరు సీఐ శ్రీనివాసంతి ఆదేశాల మేరకు పోలీస్ హెడ్ కానిస్టేబుల్స్ దాము, రెడ్డప్ప ముందుకొచ్చారు. వారు ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేశారు. అనంతరం మృతదేహం వద్ద ఓ వ్యక్తిని కాపలా పెట్టి ఆదివారం ఉదయం చిత్తూరు సంతపేటకు చెందిన ఆశ్రమ నిర్వాహకులకు అంత్యక్రియలు చేసేందుకు అప్పగించారు. పోలీసుల చొరవ చూపి అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడానికి ముందుకు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అతిసారం.. అరికట్టాలి

వాతావరణ మార్పులతో వేసవి సీజన్ పూర్తి కావడంతో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ తరుణంలో ఇంతవరకు నిద్రావస్థలో ఉన్న వివిధ రకాల వ్యాధులు ప్రజారోగ్యంపై దాడి చేసే ప్రమాదముంది. ముఖ్యంగా అతిసార (డయేరియా) వృద్ధి చెందేందుకు ఇది అనుకూలమైన వాతావరణమని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అతిసారకు చెక్ పెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంతో విస్తృతంగా ప్రణాళికలు సిద్ధం చేసి, అవగాహన చేపడుతున్నారు. గ్రామస్థాయిలో వైద్య బృందం పర్యటించి పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. -పాలసముద్రం



వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయిస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

- ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా సోకే ఆస్కారం
- పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

సీజన్ మారే సమయంలో పిల్లలకు డయేరియా సోకే అవకాశముంది. ఈ తరహా ఆరోగ్య సమస్యల బారిన పడేవారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఆరు నెలల నుంచి ఏడాది లోపు చిన్నారులు ఈ సమస్య బారిన పడితే అధికంగా నీళ్ల విరోచనాలు అయ్యి భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

రోటా వైరస్

ప్రస్తుత సీజన్ మార్పులో భాగంగా రోటా వైరస్ ఉధృతమై డయేరియా సోకే అవకాశముంది. ఈ వైరస్ తాగేనీరు, కలుషిత ఆహారం, ఇతర తినుబండారాల ద్వారా శరీరంలోకి వెళ్లి అతిసారకు దారి తీస్తుంది. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా సోకే ఈ ఆరోగ్య సమస్యతో అవస్థలు తప్పవు. సీజన్‌లో అధికంగా పిల్లలపై ఈ వైరస్ ఎక్కవ ప్రభావం చూపుతుంది.

క్షేత్రస్థాయిలో అవగాహన

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో వైద్యాన్ని పేదల గడపకు గత ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో ఆరోగ్య భద్రత, వ్యాధుల బారి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన పెరుగుతోంది. ప్రస్తుతం సీజన్‌లో ఆశ కార్యకర్తలు ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్ పొచ్‌లు అందుబాటులో ఉంచడంతోపాటు జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయనున్నారు. డయేరియా సోకిన పిల్లలకు 14 రోజులు జింక్ మాత్రలు అందించేలా చర్యలు చేపట్టనున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కూలర్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, ఇతర సామగ్రి తదితర వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో కిరోసిన్ గాని లేదా పురుగు మందు కలపాలి, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలి. శరీరం మొత్తం కప్పేలా దుస్తులు ధరించాలి.రోగ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. నిల్వ పదార్థాలు తినకూడదు. తాజా వేడి ఆహారం తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి. శుభ్రమైన ఆహారం తీసుకోవాలి, రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీళ్లు తాగాలి. పండ్ల రసం, కొబ్బరి నీళ్లు, సూప్ వంటివి తీసుకోవాలి. వైద్యుల సూచనల మేరకు వైద్యం తీసుకోవాలి.



అతిసారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

దోమల నివారణ



ప్రస్తుతం వాతావరణ మార్పులతో అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నాం. దోమలు వృద్ధి చెందకుండా మలాథియాన్ మందులు పిచికారీ చేస్తున్నాం. పారిశుధ్య లోపం జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–గాలి మహేష్, సర్పంచ్, శ్రీకావేరిరాజుపురం

పరిశుభ్రత తప్పనిసరి



వర్షాకాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, దోమలు వృద్ధి చెందడానికి అనువైన కాలం. ఈ కాలంలో ఇమ్యూనిటీ కూడా కొంత బలహీనపడుతుంది. దీంతో అనారోగ్యం ఎక్కువగా వస్తుంటుంది. ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో వచ్చే తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, చర్మ సమస్యలు వంటి లక్షణాలు ఎక్కువగా కనిస్తుంటాయి. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వెంటనే అవసరమైన వైద్య పరీక్షలు చేసుకోవాలి.

–సతీష్ , ఎంపీడీఓ, పాలసముద్రం

బిడ్డకు తల్లిపాలు అందించాలి



పిల్లలకు అతిసార సోకి నీళ్ల విరేచనాలు అవుతున్న సమయంలో, తల్లిపాలు అందించడం బిడ్డకు శ్రేయస్కరం. ఆరు నెలల్లోపు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలి. ఐదేళ్ల లోపు చిన్నారులకు నోటి ద్వారా, అనుబంధ ఆహారం అధికంగా ఉండేలా చూసుకోవాలి. బిడ్డకు ఆహారం తినిపించేందుకు, వంట చేయడానికి ముందు బిడ్డల మల, మూత్ర విసర్జన తీసివేసిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. నీళ్ల విరేచనాలు సంభవిస్తే ఓఆర్ఎస్ ద్రావణాన్ని నిర్దేశిత మోతాదులో అందించాలి. అలసత్వం లేకుండా వైద్యులను సంప్రదించాలి.

–డాక్టర్ మోహన్‌కృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి

చిన్నారికి నూకతోటి ఆశీస్సులు



బాలికను ఆశీర్వదిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: పట్టణంలోని స్థానిక ఆర్ఎంఆర్. కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం నాగలాపురం మండల సచివాలయ కన్వీనర్ దేశప్పన్ మనవరాలికి ఓణీల ఫంక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్య అతిథిగా హాజరై బాలికను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ నాయకులు అపరంజిరాజు, చిన్నదొరై, మనోహర్ రాజు, శ్యామ్, జె.బి.మునిరత్నం, మోహన్ మొదలియార్, ఉదయ్ కుమార్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



ఏలుమలై దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోషియల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చెందిన ఏలుమలైకి ఆదివారం ఎంఈఓ గిరిజ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మార్కొండనాయుడు, లింగమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సన్మానం చేపట్టారు. కార్యక్రమానికి విచ్చేసిన ఉపాధ్యాయుల ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి. మాట్లాడుతూ ఏలుమలై 45 ఏళ్ల సేవలను కొనియాడారు. శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు స్వామిరాజు, పీతాంబరరాజు, రఘు, దేవయ్య, దొరస్వామి, టీచర్లు వెంకటేష్, ప్రకాష్, చంద్రశేఖర్, దేవరాజ్, జయవేలు, కేశవులు, మోహన్, కుమార్, మునస్వామి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాల మేనిఫెస్టో కార్యక్రమానికి తరలిరండి



మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: నియోజవర్గ స్థాయిలో నిర్వహించే వైఎస్ఆర్ సీపీ కార్యక్రమానికి నాయకులు అంతా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఈ సందర్భంగా పుత్తూరులోని ఆయన నివాసంలో మాట్లాడుతూ అధికారం కోసం నోటికి వచ్చిన అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాల మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఇందుకోసం గంగాధరనెల్లూరు నియోజవర్గం స్థాయిలో మంగళవారం మండలంలోని 49 కొతతపల్లిమిట్ట దీపిక కళ్యాణ మండలంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి నియోజవర్గ స్థాయి నాయకులు అందురూ హాజరవ్వాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పాల్గొంటారని తెలిపారు. చంద్రబాబు ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నాడో వైఎస్ఆర్ సీపీ నాయకులు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు.



ముప్పయ్యేళ్ల తర్వాత ఒక్కటైన 1994-95 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

అపూర్వ కలయిక

వెదురుకుప్పం: జెడ్పీ హైస్కూల్ లో 1994–95 సంవత్సరం అప్పటి టెన్త్ విద్యార్థులు ఆదివారం వెదురుకుప్పంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా 50 మంది పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయ అలింగనం చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలకు వెయింగ్ మెషీన్‌ను వితరణ చేశారు. అనంతరం తమను చేయిపట్టి ముందుండి నడిపించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేసుకుని సహపంక్తి భోజనం చేశారు.

రూ.40.42 లక్షల వసూలు

చిత్తూరు కార్పొరేషన్: ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల చెల్లింపులు కేంద్రాలు పనిచేశాయని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈలు మునిచంద్ర, సురేష్ తెలిపారు. ఈ మేరకు డివిజన్ల పరిధిలో వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. మొత్తం 2,314 మంది రూ.40.42 లక్షలు బిల్లులు చెల్లించారని వివరించారు.

ఫ్లెక్సీ చించివేత

- కేసు నమోదు చేసిన పోలీసులు



చిరిగిపోయిన ఎమ్మెల్యే థామస్ బ్యానర్

శ్రీరంగరాజపురం: ఎమ్మెల్యే ఫ్లెక్సీని చించేసిన ఘటన మండలంలోని పిళ్లారికుప్పం క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి చోటుచేసుకున్నది. గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ పుట్టినరోజు సందర్భంగా పిళ్లారికుప్పం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బాలు పిళ్లారికుప్పం క్రాస్ రోడ్డులో బ్యానర్‌ను ఏర్పాటు చేశాడు. పిళ్లారికుప్పం పంచాయతీ యల్లంపల్లి గ్రామానికి చెందిన మండల టీడీపీ ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, పిళ్లారికుప్పం గ్రామానికి నోమేశ్వర్ శనివారం రాత్రి ఎమ్మెల్యే బ్యానర్‌ను చించేశారు. దీంతో బాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అందులో టీడీపీ నాయకుడు నిరంజన్‌రెడ్డి, నోమేశ్వర్ బ్యానర్‌ను చింపినట్లు నిర్ధారణ కావడంతో ఎస్ఐ సుమన్ వారిపై కేసు నమోదు చేశారు. బ్యానర్‌ను ఎందుకు చింపారో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే పరిశీలించి పరిష్కరిస్తామని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేడుకగా లక్క గృహ దహనం





ప్రత్యేక అలంకరణలో శ్రీద్రౌపదీ ధర్మరాజుల వారు, ఆలయ ఆవరణలో అన్నదానం

కార్వేటినగరం: శ్రీదౌపదీ, ధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి లక్కా గృహ దహనం కార్యక్రమాన్ని భక్తులకు కనులకు కట్టినట్లు శ్రీవేంకటేశ్వర నాటక కళామండలి వారు ప్రదర్శించారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ పాండవులు అరణ్యావాసంలో ఉన్నప్పుడు చేసిన లక్కాగృహ దహనాన్ని భక్తులను ఆకట్టుకునే విధంగా అభివర్ణించారు. ఉదయం ద్రౌపదీ ధర్మరాజుల వారి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉభయదారులైన రజక కలస్తులు అమ్మవారికి సమర్పించిన సారెతో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఉత్సవమూర్తులతో పాటు శ్రీకృష్ణుని సుందరంగా అలంకరించి, ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి, మంగళవాయిద్యాల నడుమ గ్రామవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నాగరాజుయాదవ్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రవియాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షులు కట్లరవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉపకోశాధికారి సాయిరాయల్, అర్చకులు సుమన్‌యాదవ్, బాబాఆచారి, కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెతో చీకటి



పుత్తూరు ఫ్లైఓవర్‌పై అలుముకొన్న చీకటి

పుత్తూరు: సమస్యల పరిష్కారం కోసం గత కొద్ది రోజులుగా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కారణంగా ఆదివారం పుత్తూరు పట్టణంలో పలు చోట్ల అంధకారం అలముకుంది. పట్టణంలోని 600 మీటర్ల పొడవైన ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఒక్క లైటు కూడా వెలగక పోవడంతో చీకటి అలుముకొంది. అలాగే పట్టణంలో పలుచోట్ల స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టైమింగ్ సిస్టమ్ ఉన్న చోట్ల మాత్రం స్ట్రీట్ లైట్లు వెలుగుతుండగా, మ్యానువల్ సిస్టం ఉన్న చోట లైట్లు వెలగడం లేదు. ఇది పూర్తిగా కార్మికుల సమ్మె ప్రభావమని స్పష్టమవుతోంది. ఈ దుస్థితికి కారణం కూటమి ప్రభుత్వం మొండి వైఖరే కారణమని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన కోరికలను నెరవేర్చి, ప్రజలకు ఎదురవుతున్న సమస్యల నుంచి ఉపశమనం కలిగించాల్సి ఉంది.

కోర్సుల ఎంపికే కీలకం



- ఇంటర్మీడియెట్ తర్వాత కోర్సులపై అవగాహన అవసరం
- మూడు, నాలుగేళ్లు కష్టపడితే ఆనందమయ జీవితం
- సంప్రదాయ డిగ్రీ కోర్సులతోనూ ఉపాధి

కార్వేటినగరం: ఇంటర్ తరువాత ఏ కోర్సు చదవాలి, ఏ రంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదళ్లను తొలిచేస్తుంటాయి. తల్లిదండ్రులు, స్నేహితుల ఒత్తిడి మేరకు నిర్ణయం తీసుకోకుండా విద్యార్థులు ఇష్టమైన కోర్సును ఎంపిక చేసుకుంటే భవిష్యత్తు ఆనందంగా ఉంటుంది. ఈ ఏడాది జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 9246 మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో 1576 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 70 శాతం మేరకు ఇంజినీరింగ్ విద్యను అభ్యసించడానికి సిద్ధమవుతున్నట్లు అంచనా. ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న కోర్సులు ఇవీ...

వైద్య విద్య

ఇంటర్లో బైపీసీ చదివేవారు వైద్య విద్య అభ్యసించేందుకు అవకాశముంది. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంబీబీఎస్ సీటు లభిస్తుంది. వైద్య విద్య పూర్తి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ వైద్యులుగా ఉద్యోగం పొందే అవకాశాలు అధికంగా ఉంటాయి. బీడీఎస్ పూర్తి చేసిన దంత వైద్యులుగా స్థిరపడవచ్చు

సీఏతో..

సీఏ(చార్టర్డ్ అకౌంటెంట్) మంచి ఉపాధినిచ్చే కోర్సు. ఇంటర్ తరువాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. దీనిలో అర్హత సాధించి, ఐపీసీఏలో చేరవచ్చు. ఇది నాలుగున్నర సంవత్సరాల కోర్సు.

కామర్స్ కోర్సులు

బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌ను బీకాం ఆనర్స్ అని కూడా పిలుస్తారు. ఇంటర్‌లో కామర్స్ చదివిన విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు. కేంద్ర, రాష్ట్ర విశ్వ విద్యాలయాల్లో బీకాం ప్రవేశానికి సీయుఈటీ పరీక్షను రాయాల్సి ఉంటుంది. బ్యాంకింగ్, బీమా రంగాల్లో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే విద్యార్థులు బీకాం అకౌంటింగ్, టాక్సేషన్ తీసుకోవాలి. బీకాం కోర్సు పాఠ్యాంశాల్లో ఇండియన్ టాక్స్ సిస్టమ్ ఫైనాన్షియల్ అకౌంటింగ్,వ్యాల్యూయాడెడ్ ట్యాక్స్, సెంట్రల్ టాక్స్, ప్రొసీజర్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, బిజినెస్ కమ్యూనికేషన్ ఉంటాయి. బీబీఏ, సీఏ, సీఎస్ తదితర వృత్తి పరమైన కోర్సులను చదవడానికి వీలుంది.

ఇంజినీరింగ్

జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, ఏపీఈఏపీ సెట్లో ఇంజినీరింగ్ కోర్సులకు ప్రాధాన్యత అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్, ఈఈఈ, ఏఈ, ఐటీ తదితర కోర్సులు ఉన్నాయి. ఐఐటీ ఎన్ఐటీలో చేరి ఇంజినీరింగ్ చేస్తే డిగ్రీ పూర్తయ్యేలోగా వివిధ కంపెనీల నుంచి ఆఫర్లు వస్తున్నాయి. మన రాష్ట్రంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆఫర్లు వస్తున్నాయి.

డిగ్రీతో బోలెడు అవకాశాలు

సీయూ సెట్ రాసి, జాతీయ స్థాయిలో ప్రాధాన్యం గల విశ్వవిద్యాలయాల్లో హ్యూమన్ సైన్సు కోర్సులు చదవచ్చు. మన రాష్ట్రంలో బీఏతో పాటు బీకాం జనరల్ కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీ కంప్యూటర్ కోర్సుకు కూడా డిమాండ్ ఉంది.డిగ్రీ చదివే విద్యార్థులకు నైపుణ్యాల పెంపుపై వివిధ యూనివర్శిటీలు దృష్టి సారించాయి. ఇప్పుడిప్పుడే క్యాంపస్ ఇంటర్వ్యూలలో డిగ్రీ చదివే విద్యార్థులకు కూడా అవకాశాలు పొందుతున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలనుకునేవారు డీఈడీ పూర్తి చేసి అవకాశాలు పొందవచ్చు. న్యాయవాద వృత్తిలో స్థిరపడాలనుకునే విద్యార్థులు ఐదేళ్ల కోర్సులకు చెందిన ప్రవేశ పరీక్షలు రాసి ఇంటర్ తరువాత న్యాయ విద్యను అభ్యసించవచ్చు

ఫార్మసీకి ప్రాధాన్యం

ఔషధ రంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. ఏపీ ఈఏపీసెట్‌తో బి-ఫార్మసీ ప్రవేశాలు జరుగుతాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, హాస్పిటల్ ఫార్మాసిస్టులుగా ఉద్యోగాలు లభిస్తాయి.

వ్యవసాయం, ఉద్యానం..

ఏపీ ఈఏపీసెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ చదివే అవకాశం ఉంది. నాలుగు సంవత్సరాల ఈ కోర్సులు పూర్తి చేస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి మార్గాలు ఎక్కువగా ఉన్నాయి.


నర్సింగ్‌తో స్వయం ఉపాధి

ఇంటర్ బైపీసీ విద్యార్థులకు నర్సింగ్ చక్కని అవకాశం. ఈ కోర్సుతో స్వయం ఉపాధి పొందడమే కాకుండా రోగులకు సేవ చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్ తరువాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే మహిళలకు మంచి అవకాశాలు ఉంటాయి. రెండేళ్ల ఫిజియోథెరపీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఫైన్‌ఆర్ట్స్‌తో ఉజ్వల భవిత

పెయింటింగ్, శిల్పకళ, ప్రింట్ మేకింగ్, విజువల్ కమ్యూనికేషన్, ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్, ఆర్ట్ హిస్టరీ తదితర విభాగాల్లో శిక్షణ పొందడానికి ఫైన్ ఆర్ట్స్ కోర్సులు ఉపకరిస్తాయి. ఫైన్ ఆర్ట్స్‌లో డిగ్రీ లేదా డిప్లమా పూర్తి చేసిన అనంతరం విద్యార్థులు గ్యాలరీలు, మ్యూజియం, మీడియా సంస్థలు, విద్యారంగం తదితర రంగాల్లో ఉద్యోగాలు పొందడానికి వీలుంటుంది.

డిగ్రీ కోర్సులతో ఉపాధి



ఇంటర్ తర్వాత డిగ్రీ కోర్సులతో ఉపాధి పొందడానికి వీలుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎంప్లాయిబిలిటీ కోర్సులు ప్రవేశ పెట్టారు. వీటికి డిమాండ్ పెరుగుతోంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులతోపాటుగా ఆక్వా కల్చర్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులను కలిపి డిగ్రీ చేసుకునే అవకాశం ఉంది.

–విజయులురెడ్డి, ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల, కార్వేటినగరం

5 నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన శ్రీ కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.సిద్దేశ్వర రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జూలై 5న మహాద్వార పూజ, అంకురార్పణ, ధ్వజారోహణం కార్యక్రమంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతి రోజు ఆలయంలో అర్చకులు సీతా రామ లక్ష్మణులు, ఆంజనేయస్వామికి తిరుమంజనం, పాలాభిషేకం, ఊంజల్ సేవ నిర్వహిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా హంసవాహనం, సింహ వాహనం, హనుమంతు వాహనం, శేష వాహనం, కల్యాణోత్సవం, గరుడసేవ, రథోత్సవం, అశ్వవాహనం, చక్రస్నానం, సూర్యప్రభ, చంద్ర ప్రభ, పుష్పపల్లకి సేవ, కల్పవృక్ష వాహనం, తెప్పోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని భక్తులు విశేషంగా పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయలని కోరారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వాహకులు శంకర్ రెడ్డి, పాలాక్షి రెడ్డి పాల్గొన్నారు.